అనంతపురంలో ముస్లిములకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్మాణం చేసిన టిడ్కో గృహాలు నేటి లబ్ధిదారులకు అందలేదు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ పనులను ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. 2019లో టిడిపి ప్రభుత్వం ఓడిపోయి వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి ప్రభుత్వం ప్రభుత్వం టిడ్కో గృహాలను ఏ మాత్రం పట్టించు కోలేదు. 2024లో మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చింది. దీంతో లబ్ధిదారులకు టిడ్కో గృహాలపై ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వం అయినా టిడ్కో గృహాలను అందిస్తుందాని ఎదురుచూస్తున్నారు.

కొటిపి వద్ద నిర్మాణ దశలో ఆగిన టిడ్కో గృహాలు

బాలయ్యా.. టిడ్కో గృహాలు చూడయ్యా..!

- ఎన్నికల ముందు ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ
- నేటికీ లబ్ధిదారులకు అందని ఇళ్లు
- నెరవేరని పేదల సొంతింటి కల
- ఏడేళ్లుగా తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి-హిందూపురం

2024 జూలై 14వ తేదీన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పర్యటనలో భాగంగా పట్టణ సమీపంలో కొటిపి వద్ద ఆగిన టిడ్కో గృహాలను పరిశీలన చేశారు. ఆరు నెలల్లో టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ హామీ ఇచ్చి 8 నెలలు అవుతున్నా అందులో ఎలాంటి కదలికా లేదు. దీంతో పేదల సొంతింటి కల నెరవేర లేదు. హిందూపురం పట్టణంలో చాలా మంది పేదలు సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. హిందూపురంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఇందులో క్యాటగిరీ వారీగా 300 చదరపు అడుగులు, 1104, 365 చదరపు అడుగులు 1344, 430 చదరపు అడుగుల 288 మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు.

టిడ్కో గృహాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ కింద లబ్ధిదారుల వాట కింద రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు సైతం వారు ఇప్పించారు. పనులు మాత్రం 2019 సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి ఆగిపోయాయి. పూర్తి అయిన టిడ్కో గృహాలను జగన్ ప్రభుత్వం ఉచితంగా లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పడంతో పాటు 2022 జూన్‌లో లబ్ధిదారులకు ఆ ఇళ్లను రిజిస్టర్ చేస్తున్నట్లు చెప్పి రిజిస్టర్ ప్రక్రియ చేపట్టి పూర్తి చేశారు. ఆచరణలో టిడ్కో గృహాల పనులు వైసిపి ప్రభుత్వం చేపట్టలేదు. ఇది చాలదన్నట్లు క్యాటగిరీల వారీగా టిడ్కో గృహాలను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. జగనన్న కాలోనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలైన సకాలంలో పూర్తి లబ్ధిదారులకు ఇచ్చారంటే అదీలేదు.

బాలయ్య స్పందించేరా..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బాలయ్య టిడ్కో గృహాలను సందర్శించారు. ఆరు నెలల్లో పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం అని వాగ్దానం చేశారు. వాగ్దానం చేసి 8 నెలలు పూర్తి అవుతున్నప్పటికీ దాని గురించి బాలయ్య, ఆయన పిఎలు స్పందించడం లేదు. వారి నుంచి స్పందన రాకపోవడంతో టిడ్కో గృహాల కథ కంచికి చేరిందా అన్న సందేహం లబ్ధిదారుల్లో వ్యక్తం అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో కేటగిరీల వారీగా రద్దయిన టిడ్కో గహాలు....

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఆధ్వర్యంలో మొదటి ధశలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చేపట్టిన టిడ్కో ఇళ్లకు సంబంధించి మొత్తంగా 7184 ఇళ్లను రద్దు చేశారు. ప్రధానంగా 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇందులో ఆ మూడు కేటగిరీల వారీగా పరిశీలిస్తే 300చదరపు అడుగులకు సంబంధించి 1472 ఇళ్లను రద్దు చేయగా, అందులో తాడిపత్రిలో 512, పుట్టపర్తిలో 288, కదిరిలో 96, హిందూపురంలో 384, గుత్తిలో 192 ఇళ్లు ఉన్నాయి. 365 చదరపు అడుగులకు సంబంధించి 3456 ఇళ్లను రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థల పరిధిలో 1008, తాడిపత్రిలో 240, గుంతకల్లులో 144, పుట్టపర్తిలో 288, పామిడిలో 720, కదిరిలో 48, హిందూపురంలో 960, గుత్తిలో 48 ఇళ్లు ఉన్నాయి. 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి మొత్తంగా 2256 ఇళ్లు రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థలో 1056, తాడిపత్రిలో 384, రాయదుర్గంలో 48, గుంతకల్లులో 192, పుట్టపర్తిలో 144, పామిడిలో 144, కదిరిలో 48, హిందూపురంలో 192, గుత్తిలో 48 ఇళ్లను అప్పటి ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో టిడ్కో గృహాలపై దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేసి అందజేయాలని లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ విన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం దీనిపై ఏమాత్రం దృష్టి సారించి పేదల సొంతింటి కల నెరవేరుస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అప్పటి..ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫోటో)

2024 ఎన్నికల అనంతరం జూలై 14వ తేదీన టిడ్కో గృహాలను పరిశీలన చేస్తున్న బాలయ్య(ఫైల్ ఫోటో)

హిందూపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా ఈదుల్ ఫితర్

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలువురి శుభాకాంక్షలు

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఈదుల్‌ఫితర్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నాడు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు పండుగను సంబరంగా జరుపుకున్నారు. రంజాన్ మాసం నెల రోజులపాటు ముస్లిములు చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. సోమవారం నాడు ఈదుల్ ఫితర్‌ను జరుపుకున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం 9 గంటలలోపు ప్రార్థనలు ముగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. హిందూపురం, కదిరి, ధర్మవరం పట్టణాలతో పాటు జిల్లాలోని అన్ని ఈద్గా మైదానంలో ఉదయం నిర్వహించిన ప్రార్థనల్లో వందలాది మంది ముస్లిములు పాల్గొన్నారు. దీంతోపాటు నగరంలోని ఇతర మసీదులు, ఈద్గా మైదానాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు మౌలానాలు, పెద్దలు పవిత్ర రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవ, సాయం, ధాతృత్వం, ధార్మిక చింతన కలిగి ఉండాలని ఉపదేశం ఇచ్చారు. ఆయా ఈద్గాల వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు అక్కడికెళ్లి ప్రార్థనల అనంతరం ముస్లిములకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి -అనంతపురం

కరువు ప్రభావిత మండలాల గుర్తింపు

అనంతలో 6, సత్యసాయిలో 2 మండలాల ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా అనంతపురంలో 6, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు కరువు మండలాలను గుర్తించారు. ఇందులో అనంతపురం జిల్లాలో బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి, శ్రీ సత్యసాయి జిల్లాలో తనకల్లు, రొద్దం మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించి వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిసోడియా తెలిపారు. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం, ఈ మండలాల రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

గుండెపోటుతో జెవివి నాయకుడు శ్రీపతి మృతి

శ్రీపతి(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జెవివి నాయకుడు శ్రీపతి(35) గుండెపోటుతో సోమవారం ఉదయం అనంతపురంలో మరణించాడు. ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో ఆయన అస్వస్థతకు గురికావడంతో వెంటనే మిత్రునితో కలిసి అనంతపురం ప్రజా వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించేలోపు ఆయన మరణించారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామానికి చెందిన శ్రీపతి జెవివి నాయకునిగా ఉంటూ అనేక ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజా సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రముఖపాత్ర పోషించారు. మూఢమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ అనేక కార్యక్రమాలు చేశారు. విద్యార్థుల్లో సైన్స్‌పై చైతన్యం చేసేందుకు వందలాది సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శిగా పని చేసి సైన్స్ గొప్పదనాన్ని నిరంతరం ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేశారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జెవివి రాష్ట్ర మహాసభల విజయవంతంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. శ్రీపతి అంత్యక్రియలను మంగళవారం ఉదయం ఆయన స్వగ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

పలువురి సంతాపం

శ్రీపతి మృతి విషయం తెలుసుకున్న పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడ వి.రాంభూపాల్, రాప్తాడు మండల సిపిఎం కార్యదర్శి పోతులయ్య పుల్లలరేవు గ్రామానికి వెళ్లి శ్రీపతి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ సైన్స్‌ను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీపతి చేసిన కృషి వెలకట్టలేనిదని రాంభూపాల్ తెలియజేశారు.

శ్రీపతి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వి.రాంభూపాల్, పోతలయ్య

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సోమందేపల్లి : కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్ కోరారు. స్థానిక వాల్మీకి సర్కిల్‌లో కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు ఎంతో ఉపయోగపడే సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలన్నారు. అలాగే కార్మికులకు ప్రమాదబీమా, పెళ్లి, కాన్పు కానుక, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పని ముట్లు, లేబర్ కార్డు, తదితర సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడు సభ్యత్వం చెల్లించి సంఘంలో చేరి కార్మికుల సంక్షేమం కోసం సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. సమావేశంలో రవి, కంబాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ స్మార్ట్ మొబైల్ షోరూంను ప్రారంభిస్తున్న నటి ఐశ్వర్య రాజేష్

'పురం'లో నటి ఐశ్వర్య రాజేష్ సందడి

బులిరాజుతో కలిసి హ్యాపీ స్మార్ట్ మొబైల్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- హిందూపురం

హిందూపురం పట్టణంలో సంక్రాంతి వస్తున్నా ఫేం నటి ఐశ్వర్య, బుల్లిరాజులు సందడి చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ స్మార్ట్ మొబైల్ షోరూంను ఆదివారం ప్రారంభించారు. షోరూం ప్రారంభం సందర్భంగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కీర్తిస్తూ నటి ఐశ్వర్య జై బాలయ్య అంటూ నినాదాలు చేసి ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ సినీ నటుడు, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గంలో హ్యాపీ మొబైల్ షోరూంను ప్రారంభించడానికి రావడం సంతోషంగా ఉందన్నారు. హ్యాపీ మొబైల్ షోరూమ్‌లో ఉగాది పండుగ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హ్యాపీ మొబైల్స్ ఎమ్‌డి.కృష్ణ పవన్ మాట్లాడుతు హ్యాపీ మొబైల్స్ 85వ స్టోర్‌ను హిందూపురంలో ప్రారంభించామన్నారు. తమ స్టోర్‌లో అన్ని రకాలపైన సెల్ ఫోన్స్ తో పాటు టివిలు ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట సంతోష్, హ్యాపీ మొబైల్స్ సిబ్బంది పా ల్గొన్నారు. ఐశ్వర్యను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హ్యాపీ మొబైల్ షోరూం వద్దకు వచ్చారు.

వైసిపి నాయకులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

మడకశిర : వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌తో పాటు పలువురు నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక సమయంలో కూటమి నాయకులు అడ్డంకులు సృష్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న సందర్భంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వారిని ప్రశ్నించినందుకు ఆమెతో పాటు జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పలువురు నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడం తగదని, వెంటనే వారిపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఉనికి కోసమే ఎమ్మెల్యేపై వైసిపి విమర్శలు

మడకశిర : వైసిపి అంతర్గత పోరులో పైచేయి సాధించడానికి, ఉనికి కోసం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప, ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఎంఎస్.రాజుపై విమర్శలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ధ్వజమెత్తారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి హయాంలో కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేని వారు నేడు అభివృద్ధి జరగలేదనడం చూసి ప్రజలే నవ్వుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే చేసిన మంచి పనులను గుర్తించకుండా ఏకపక్షంగా వార్తలు రాయవద్దని, అవాస్తవాలు ప్రచురించవద్దని సూచిస్తే అది పత్రికా స్వేచ్ఛపై దాడి అని వైసిపి నాయకులు విమర్శించడం దుర్మార్గమన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేయాలని హితవు పలికారు.

పోలీసుల వలయంలో పాపిరెడ్డిపల్లి

- పెద్ద ఎత్తున బలగాల మోహరింపు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గృహనిర్బంధం
- పాపిరెడ్డిపల్లిలో ఎస్పీ పరిశీలన
- రాజకీయం చేసి రాద్ధాంతం చేయొద్దు :
- మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామాన్ని పోలీసులు వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో లింగమయ్య అనే వ్యక్తి మరణించాడు. ఈ ఘటన రాజకీయ అంశంగా మారడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పోలీసులు గ్రామంలో మొహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్పీ వి.రత్న స్వయంగా గ్రామంలోకి వెళ్లి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ కలిసి ఎప్పటికప్పుడు పరిస్థితులను ఎస్పీ సమీక్షిస్తూ అక్కడి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. మతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు. పాపిరెడ్డిపల్లితో పాటు సమీప గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేశారు. టిడిపి, వైసిపి నాయకులు ఎలాంటి రెచ్చగొట్టే ప్రకటనలూ చేయకుండా సమన్వయం పాటించాలని ఎస్పీ సూచించారు.

మృతుని కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

రాజకీయ, వ్యక్తిగత కక్షల పేరుతో సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, అరాచక శక్తులను ఉక్కు పాదంతో అణచివేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలియజేశారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో ఆదివారం జరిగిన వ్యక్తిగత ఘర్షణలో కురుబ లింగమయ్య గాయపడి, అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిన విషయం తెలిసిందే. లింగమయ్య మతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గం మధ్యలో మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులిమి సమాజంలో అల్లకల్లోలం సష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్నకు మంత్రి ఆదేశించారు.

పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి సమీక్ష చేస్తున్న ఇస్తున్న ఎస్పీ వి.రత్న

పాపిరెడ్డిపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు.

గోరంట్ల మాధవ్ గృహనిర్బంధం

పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగమయ్య అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ సోమవారం ఉదయం అనంతపురం నుంచి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గ్రామంలోకి వెళ్తే ఘర్షణ వాతావరణం నెలకొంటుందని, ఈ నేపథ్యంలో వెళ్లేందుకు వీల్లేదని మాధవ్‌కు చెప్పారు. తాను వెళ్లితీరుతానంటూ మాధవ్ చెప్పడంతో పోలీసులు బలవంతంగా ఆయన్ను ఇంట్లో ఉంచి గృహ నిర్బంధం చేశారు.

పాపిరెడ్డిపల్లి ఘటన బాధాకరం
ఎమ్మెల్యే పరిటాల సునీత

పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటన బాధాకరం అని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను పరిటాల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆపాదించడం విచారకరం అన్నారు. ఘటన జరిగిన వెంటనే దీనిపై విచారణ చేపట్టి కారకులను అరెస్టు చేయాలని ఆదేశించామన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఇలాంటి ఘటనలను రాజకీయంగా వాడుకోవద్దని ఆమె సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మడకశిర : మండలంలోని బేగార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. ఒకరినొకరు పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. తమ గురువులు ప్రభాకర్, వెంకట రాముడు, రామకృష్ణ, మారుతి, సత్య నారాయణ, వేదాచలం, రాగమయి, నాగమణి, దేవరాజు, అనురాధలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, హేమలత, వనజ, వినోద, లావణ్య, మంజు, శ్రావణి, భారతి, జ్యోతి, అశ్విని, మంజుల, మల్లిక, సుమిత్ర, రాజశేఖర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత అని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం మంత్రి సోమందేపల్లి మండలంలోని నాగినాయన చెరువు, గుడిపల్లి, తుంగోడు, వెలిదడకల, నడింపల్లి పంచాయతీల నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యలు ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు.

పేదలకు నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేత

15 ఏళ్ల క్రితం పట్టణంలోని దర్గాపేట ఉప్పరవాడవీధిలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తు న్న 25 కుటుంబాలకు మంత్రి సవిత నివాస ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించడంతో పాటు కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, యాదవ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెనుకొండ ముఖద్వారానికి విద్యుత్ దీపాలంకరణ

జియో మేగా కంపెనీ వ్యవస్థాపకులు సత్య సహకారంతో వై జంక్షన్‌లో ఉన్న ముఖద్వారానికి విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయగా మంత్రి సవిత ప్రారంభించారు. శ్రీకృష్ణదేవ రాయలు విగ్రహం వద్ద పెయింటింగ్, లైటింగ్ ఏర్పాటు చేసి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, నాయకులు కేశవయ్య, ఉమ్మడి వెంకటరావు, శ్రీరాములు యాదవ్, బాబుల్‌రెడ్డి, త్రివేంద్రనాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి పట్టణంలోని హిందూపురము రోడ్డులో గల డీఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ శివన్నారాయణ స్వామి సోమవారం ప్రారంభించారు. ఎండాకాలంలో ఈ దారిలో వెళ్లే ప్రయాణికులకు, ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పుట్టపర్తిలో ఉగాది పండుగ సందర్భంగా జిల్లాలోని వివిధ అర్చకులకు కలెక్టర్ చేతన్ చేతులమీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ధర్మవరం మండలం కునుతూరు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ వినాయక ఆంజనేయ స్వామి దేవస్థానం అర్చకులు ఎం. శాంతేశ్వర ప్రసాద్‌ను కలెక్టర్ సన్మానించారు. అంతేకాకుండా హిందూపురం మండలం సంతే బిందనూర్ గ్రామానికి చెందిన పి. నారాయణమూర్తి అర్చకులు, దక్షిణామూర్తి స్వామి దేవస్థానం అర్చకులు సత్యనారాయణ శాస్త్రి, బుక్కపట్నం మండలం పి కొత్తకోట గ్రామానికి చెందిన వెంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు పంచరత్నం సుబ్రహ్మణ్య శర్మ లను ఘనంగా సత్కరించారు. దేవాదాయ శాఖ తరపున 62 సంవత్సరాలు పైబడిన అర్చకులకు ఒక్కొక్కరికి 10,116 రూపాయలతో పాటు ప్రశంసా పత్రం, పంచె, కండువా, పండ్లు దేవాదాయశాఖ తరపున కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

'ఉపాధి'లో పంచ ప్రాధాన్యతలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం త్రైమాసిక ప్రణాళికలు సిద్ధం చేశామని ఇందులో ఐదు రకాల పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కూలి రేటు రూ. 300 నుంచి 307 రూపాయలకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రధానంగా జిల్లాలో వచ్చే 3 నెలలు కూలీలు వలసలు వెళ్లకుండా 9 వేల సేద్యపు కుంటలు (ఫారం ఫండ్స్) రైతుల పొలాల్లో నిర్మించడమే లక్ష్యంగా పని పనిచేయనున్నామని ఇందుకు రూ. 62 కోట్లు వ్యయం అవుతుందని అన్నారు. రెండవ ప్రాధాన్యతగా పశువుల నీటి తొట్టెలు గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. రూ. 48 కోట్లతో 1362 తొట్టెలు నిర్మాణమే తమ లక్ష్యమన్నారు. కలెక్టరు ఆమోదంతో త్వరలోనే పనులు చేపడుతున్నామన్నారు. అలాగే పంట కాలవల్లో పూడికతీత వల్ల వర్షాలు కురిసిన నీరు వృథాకాకుండా ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా చెరువుల పునరుద్ధీకరణ క్రింద చెరువులలో పూడిక తీయించి, ఆ మట్టిని రైతు పొలాల్లోకి తీసుకెళ్లడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ పనుల వల్ల 4 గంటల పనికి కనీస వేతనం కూలీలకు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కూలీలు ఎక్కడా వలసలు వెళ్లకుండా తమ గ్రామాల్లోనే ఉపాధి పొందవచ్చని పీడీ తెలిపారు.

4 నుంచి కోదండ రాముడి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని రామ్ నగర్ కొత్తపేటలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఈనెల నాలుగవ తేదీ నుండి ఆరవ తేదీ వరకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పామిశెట్టి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చందా రామాంజనేయులు, పూజారి ఆదినారాయణ, కార్యదర్శి రంగన్న వెంకట రమణ తెలిపారు. 26 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు చెప్పారు. ఈ ఉత్సవాల నిర్వహణకు దాతలు తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు పూజారి లక్ష్మీనారాయణ, పామిశెట్టి చిన్న శ్రీనివాసులు, హరి, రాము, కోశాధికారి రాముడు సహాయ కోశాధికారి హరికృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, గౌరవ సలహా మండలి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఇడి వెలుగుల్లో రహమత్ పురం

ప్రజాశక్తి-హిందూపురం

రహమత్ పురం ప్రధాన రహదారికి ఎల్ఇడి వెలుగులు వచ్చాయి. రహమత్ పురం సర్కిల్ నుంచి ఆటో నగర్ వరకు ఉన్నా రహదారికి ఇరువైపులా ఎల్ఇడి లైట్ల ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే తొలత రహమత్ పురం సర్కిల్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు ఉన్నా 31 పోల్స్ కు రూ. 40లక్షలతో ఒక పోల్ కు రెండు లైట్ల ప్రకారం 62 ఎల్ఇడి లైట్లను సోమవారం మున్సిపల్ సిబ్బంది అమర్చారు.

అనారోగ్యంతో మహిళ మృతి

ధర్మవరం రూరల్ : ధర్మవరంలోని 39 వ వార్డు రాంనగర్‌కు చెందిన చేనేత మహిళ పూజారి ప్రమీల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, కూటమి నాయకుడు జింకా చంద్రశేఖర్ సోమవారం మృతురాలు ప్రమీల ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

సాహిత్యంలో సామాజిక సమస్యలు ప్రతిబింబించాలి

కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కవి కల్లూరు రాఘవేంద్రరావు

ఉగాది కవిసమ్మేళనంలో రచయితలు

ప్రజాశక్తి-హిందూపురం

సాహిత్యంలో సామాజిక సమస్యలు ప్రతిబింబించాలని కవులు, రచయితలు అభిప్రాయపడ్డారు. విశ్వావసు నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌జిఒ హోంలో ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు మాట్లాడుతూ సాహిత్యంలో సామాన్యుడి సాధకబాధకాలు ప్రజలకు తెలిసేలా రచనలు కొనసాగించాలన్నారు. ఎంతోమంది ప్రముఖులు తమ రచనలు, కవిత్వాల ద్వారా ప్రజల సమస్యలను తెలియజేసి పాలకుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అనంతరం కవులు కల్లూరు రాఘవేంద్రరావు -కవి ప్రబోధం, శౌంఠి జయప్రకాష్ -ఊహల దొంతరలు, సడ్లపల్లె చిదంబరెడ్డి-గుణ పాఠాలు, సిద్ధగిరి శ్రీనివాస్ -నిర్జల నదీవేదన, ఏటిగడ్డ సత్యనారాయణ -ఉగాది కావాలి మాకు, వెంకటరామిరెడ్డి-సామాన్యుడి న్యాయం అన్న అంశాలపై కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు డాక్టర్ ఈటి రామ్మూర్తి, రామకృష్ణ, ఎన్‌జిఒ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, వేణుగోపాల్ రెడ్డి, ఉమర్ ఫరూక్, శివరాం, రవీంద్రారెడ్డి, కె. నరసింహులు, ఉగ్రప్ప, గంగిరెడ్డి, లక్ష్మీపతి, ఆరాధన రెడ్డి, నిత్యానంద తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రకు అంబేద్కర్ పురస్కారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాల సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేసిన జేఏసీ జిల్లా అధ్యక్షులు కొప్పల రామచంద్ర కి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, మాల ఉద్యోగుల సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఉగాది పురస్కార వేడుకలను టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడు పాలెం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ తన సేవలను దృష్టిలో ఉంచుకొనిఉగాది పురస్కారాన్నీ అందజేయడం ఆనందంగా ఉందన్నారు .ఈ కార్యక్రమంలో దాసరి చెన్నకేశవులు, రిపబ్లిక్ ఆఫ్ పార్టీ ఇండియా అధ్యక్షుడు. మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తలబిల్లి అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు



పురస్కారం అందుకుంటున్న కొప్పల రామచంద్ర

నిర్మాణ దశలోనే ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణపనులు

ఆగిన అంగన్వాడీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు పంచాయతీ పరిధిలోని బస్టాండ్ సమీపంలో వివర్స్ కాలనీలో ఏర్పాటు చేయనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగాయి. ఐదు సంవత్సరాలుగా అంగన్వాడీ కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. అంగన్వాడీ భవన నిర్మాణానికి ప్రభుత్వం 13 లక్షల రూపాయలు కేటాయించగా కేవలం రూ.6.18 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో పనులు అర్ధాంతరంగా ఆగాయి. కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తుండటం వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పెనుకొండలో ఏప్రిల్ 14న నిర్వహించే జై భీమ్ ర్యాలీని జయప్రదం చేయాలని బహుజన చైతన్య వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక సాయి ఆరామం గెస్ట్ హౌస్ లో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ 14న పెనుకొండలో వై జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అంబేద్కర్, పూలే భావజాలాన్ని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి బహుజనులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ మనమెంతో, మనకంత అనే నినాదంతో బహుజనులు అందరూ ఏకమై రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, మన హక్కులు సాధించుకోవాలన్నారు. అధిక జనాభా కలిగి ఉన్న బహుజనుల అభివృద్ధికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుబ సంఘం ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు రొద్దం బాబు, డివిఎంసి మెంబర్ రామాంజనప్ప, రంగేపల్లి నాగరాజు, బహుజన నాయకులు నరసింహప్ప, సాయి, వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

2 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

బుక్కపట్నం : స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు జిల్లా రిజిస్టర్ విజయ కుమారి తెలిపారు. ఈ విధానంతో ప్రజలు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, వేగవంతంగా, క్రమబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఫ్లాట్ బుకింగ్ విధానం అమల్లో ఉంటుందని, స్లాట్ బుకింగ్ చేసుకొని నిర్దిష్ట సమయానికి తమ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. త్వరలోనే జిల్లాలోని అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలులోకి తీసుకొస్తారని ఆమె తెలిపారు.

అన్నదమ్ముల మధ్య గొడవ.. తోపులాటలో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-లేపాక్షి

అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో లేపాక్షి మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న విఆర్ఎ రామాంజనేయులు(42) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి రామాంజనేయులు, అతని తమ్ముడు అశ్వర్థనారాయణ మధ్య చిన్నపాటి గొడవ చోటుచేసుకొంది. ఈ క్రమంలో వారి మధ్య జరిగిన తోపులాటలో రామాంజనేయులు కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ నరేంద్ర హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని హిందూపుం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముస్లిముల నిరసన

ప్రజాశక్తి - బత్తలపల్లి

వక్ఫ్ పరిరక్షణ ముస్లిముల విశ్వాసానికి సంబంధించిన అంశమని, ఈ బిల్లులను ఆమోదిస్తే ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం అంటూ పలువురు మైనార్టీలు అన్నారు. ఈ మేరకు వారు తమ చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మసీదులో ప్రార్థనలు అనంతరం ఈద్గా మైదానానికి వెళుతూ చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యువత షేక్ షావు, నడిమింటి షేక్షావలి, సయ్యద్ బాబ్యాన్, షేక్ ముబారక్, షేక్ కాశీంవలి, సయ్యద్ బాబా, షేక్ హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : రంజాన్ పండుగ సందర్భంగా కొందరు ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ స్థానిక మసీదు నుంచి ఈద్గా మైదానం వరకూ ర్యాలీ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

దుకాణాలు రాత్రి 10 గంటల్లోపే మూసివేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో మంగళవారం నుంచి హోటళ్ళు, ఇతర దుకాణాలను రాత్రి 10గంటల లోపు మూసి వేయాలని డిఎస్‌పి కెవి మహేష్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలలో ఉన్న ముస్లిం సోదరులను దృష్టిలోఉంచుకొని రాత్రి వేళల్లో సమయాలలో మార్పులు చేశామన్నారు. రంజాన్ మాసం సోమవారం ముగియడంతో మంగళవారం నుండి రాత్రి 10 గంటల లోపే పట్టణంలోని హోటళ్లు, దుకాణాలు మూసివేయాలని నిర్వాహకులను కోరారు. పోలీస్ నిబంధనలు అందరు తప్పక పాటించాలని సూచించారు.

రెండు రోజుల ఆదాయం రూ. 3 .35 లక్షలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

2024 - 25 సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో 30, 31వ తారీకు సెలవు రోజులలో కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు చేపట్టారు. 30వ తేదీ ఆదివారం కదిరి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పది పత్రాలు రిజిస్టర్ కావడంతో ప్రభుత్వానికి లక్ష యాభై ఎనిమిది వేల నూరు రూపాయలు 31వ తేదీన సోమవారం ఏడు పత్రాలు నమోదు కావడంతో లక్షా డెభైఏడు వేలా ఏడువందల యాభై రూపాయలు ఆదాయం లభించింది. రెండు రోజులకు గాను మొత్తం మూడు లక్షల ముభై ఐదువేలా ఎనిమిదివందల యాభై రూపాయల ఆదాయం వచ్చినట్లు సబ్ రిజిస్టర్ అధికారి కవితా రెడ్డి తెలిపారు.సెలవు రోజులు రిజిస్టర్ చేయించుకున్న వారు ప్రశాంతంగా చేయించుకున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ వ్యాప్తంగా చలివేంద్రాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో పాటు మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే పలు చలివేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు తాజాగా సోమవారం పట్ట ణంలో మరో రెండు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను మున్సి పల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని సర్కిళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ చలివేంద్రాలకు అవసరమైన నీటిని పురపాలక సంఘం తరపున ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్ధన్, శంకర్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, మహాలక్ష్మి, దుర్గా మంజుళ, భారతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రత్యేక ప్రార్థనల్లో 'చిలకం', 'పరిటాల'

ప్రత్యేక ప్రార్థనల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

బత్తలపల్లిలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిములు

ప్రజాశక్తి - హిందూపురం

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన, నియమ నిష్టలతో కఠిన ఉపవాస దీక్షల కలయికే పవిత్ర రంజాన్ పండుగ అని అల్ హి లాల్ ఈద్గ మైదానంలో జరిగిన పండుగ వేడుకల్లో మౌలానా అబ్దుల్ మన్నన్, మేళాపురం సున్నీ జామీయ మసీదు మౌలానా ఖమర్ ఆలి ఖాద్రి అన్నారు. పట్టణంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో ఉన్నా ఈద్గా మైదానం, మేళాపురం సున్నీ జామీయ ఈద్గ మైదానం, కోట, రహమత్‌పురం, మోడాల్ కాలోని, శాంతినగర్, గౌసీయ మసీదు తదితర ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్ హి లాల్ ఈద్గ మైదానంలో జరిగిన ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లాతో పాటు ముస్లీం సోదరులతో కలిసి వైసిపి నాయకులు వేణు రెడ్డి పాల్గొనిప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో జామీయ కమిటీ మసీదు ముత్వల్లీ నురూల్లా, సున్నీ జామియా మసీదు ముత్వల్లీ అమానుల్లా, దాదా మహమ్మద్, షాబుద్దీన్, సాదత్, నజీర్ ఆహ్మద్, బాబాఫక్రోద్దిన్, తలహాఖాన్, సిద్దిక్‌షేర్, గౌసియా మసీదుల్లో రహమతుల్లా సేర్ ఆయా ప్రార్థన ఈద్గా మైదానాల్లో ఆయా ముత్వల్లీలు, మౌలానాలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పలువురు శీతల పానియాలు పంపిణీ చేశారు.

శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల నాయకులు

రంజాన్ సందర్భంగా వైసిపి, టిడిపి, ప్రజా సంఘాల నాయకులు ముస్లీం సోదరులను ఈద్గా మైదానంలో కలిసి పండుగ శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, టిడిపి సత్య సాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజినప్ప, మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమర్ నాథ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, పలువురు కౌన్సిలర్లు, టీడీపి నాయకులు, వైసిపి ఆధ్వర్యంలో నాయకులు వేణురెడ్డితో పాటు మున్సిపల్ వైస్ చైర్మేన్ జబివుల్లా, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మార్కెట్ చాంద్‌బాషా, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ముస్లీం సోదరులను కలిసి పండుగ శుభకాంక్షలు తెలిపారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీల హలీమా కుటుంబానికి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అహూడ చైర్మన్ టీసీ వరుణ్ రంజాన్‌తోఫాను అందజేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా పంపించిన రంజాన్ తోఫాతో పాటు పట్టుచీర, 25 వేల రూపాయల నగదును అందజేశారు.

కదిరి అర్బన్ : రంజాన్ వేడుకలు పట్టణంలో ఉన్న ఈద్గా మైదానంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజీ, మత పెద్దలు నేతృత్వంలో ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజ్‌ను నిర్వహించారు. నమాజ్ పూర్తైన అనంతరం ఖాజీ, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. పండుగ వేళ భద్రతా పరిరక్షణ చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, వేడుకలు శాంతియుతంగా కొనసాగేలా డీఎస్పీ శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి,పోలీసులుచర్యలు చేపట్టారు.

ధర్మవరం రూరల్ : ప్రతి ముస్లిం కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు.సోమవారం రంజాన్ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.

బుక్కపట్నం : రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తి జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదు నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ర్యాలీగా వెళ్లి స్థానిక దర్గా వద్ద ప్రత్యేక పూజలు ఆచరించారు.

కొత్తచెరువు : రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ధర్మవరం రోడ్డులో ఉన్న నమాజ్ గుట్ట వద్ద దర్గా ప్రాంతంలో ఉన్న ఈద్గా మైదానాల్లో మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని వెంకటగారిపల్లి, మాల్యవంతం, ం. చెర్లోపల్లి, రామాపురం, అనంతసాగరం, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, ముష్టూరు, పోట్లమర్రి, గంటాపురం. డి. చెర్లోపల్లి, ఓబుళాపురం తదితర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు బత్తలపల్లిలోని మదీనా, జామీయా, నూర్ణానీ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో ఈద్గాకు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట, కటారుపల్లి, మల్ల మీద పల్లి, తూపల్లి తదితర గ్రామాలలో ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేకమైన ప్రార్థనలు చేశారు. మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సోమందేపల్లి : సోమందేపల్లిలో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. మత పెద్ద మౌలానా, జామియా మసీదు ముతవల్లి మహమ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నమాజ్, ప్రార్థనలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు అక్రమ్‌బాషా, యుడి కళ్లాయప్ప, ఈద్గా కమిటీ సభ్యులు మేస్త్రీ నజీర్, అల్లాబకాష్, ఫరీద్, అన్వర్, వాజిద్, బాబా, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : దాదాపు నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ముస్లింలు రొద్దంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ఇమామ్‌లు, మసీదు ముతవల్లిలు అల్లా సందేశాన్ని, రంజాన్ పర్వదినం విశిష్టతను ముస్లింలకు వినిపించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పావగడ : రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ముస్లింలు తాలూకాలోని పావగడ, వైఎన్ హోసకోట ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. ముందుగా ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఈద్గా మైదానం చేరుకున్నారు. అక్కడ మిఠాయిలు పంచుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారను. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప హాజరై ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షంషుద్దీన్, మహ్మద్, ఇస్మాయిల్, సాధిక్‌సాబ్, నజీర్ అహ్మద్‌ఖాన్, జాఫర్, వైఎన్.హొసకోటకి చెందిన పలువురు ముస్లిం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.